క్లుప్తంగా

21న మోడల్‌లో ప్రవేశానికి పరీక్ష

తడ: మండలంలోని అక్కంపేట వద్ద ఉన్న ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 21న పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌజన్య ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అందులో ఫొటోలు లేకపోయినా ఆందోళన చెందవద్దని వెల్లడించారు. హాల్ టికెట్‌పై ఫొటో అంటించి హెచ్‌ఎంలతో సంతకం చేయించుకుని, మరొక ఫొటో వెంట తీసుకురావాలని సూచించారు.

చిట్టమూరమ్మకు ప్రత్యేక పూజలు

చిట్టమూరు: చిట్టమూరు గ్రామ దేవత చిట్టమూరమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు రంగవల్లులతో అమ్మవారి చిత్రాన్ని తీర్చిదిద్దారు. అనంతరం సామూహికంగా పొంగళ్లు పెట్టారు. తదుపరి అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు.

వేసవిలో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి

వెంకటగిరి (సైదాపురం): వేసవి సెలవుల్లో పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని వెంకటగిరి సీఐ ఏవీ రమణ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వేసవిలో విద్యార్థులకు వేసవి సెలవులు ఇస్తున్న నేపథ్యంలో వాగులు, వంకలు, బావులు, చెరువుల వద్దకు ఈత కోసం వెళ్లకూడా చూడాలన్నారు. ఈత సరద ప్రాణం మీదకు తెచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వెంకటగిరి రూరల్: వెంకటగిరి పట్టణంలోని పాలకేంద్రం వద్దనున్న 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. ఈ క్రమంలో శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వెంకటగిరి పట్టణం, రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

బాలాయపల్లి (సైదాపురం): బాలాయపల్లి మండలంలోని జయంపు గ్రామంలో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు గడ్డివామి కాలిపోయింది. అగ్నిమాపక అధికారుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వీర రాఘవయ్య ఇంటి సమీపంలో గడ్డివామి వేసుకున్నాడు. గురువారం అర్ధరాత్రి ఉన్నట్టుండి వామికి నిప్పు అంటుకుని మంటలు చెలరేగాయి. గమనించిన చుట్టుపక్కల వారు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో రూ.30 వేలు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు. గిట్టని వ్యక్తులు గడ్డివామికి నిప్పు పెట్టారని, విచారించి న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తమిళనాడు రేషన్ బియ్యం పట్టివేత

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మునిరత్నం నగర్ సమీపంలో శుక్రవారం రాత్రి ఆటోలో తరలిస్తున్న తమిళనాడు రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు మునిరత్నం నగర్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట వైపు నుంచి కోటకు వెళుతున్న ఆటోను పరిశీలించగా తమిళనాడుకు చెందిన సుమారు 12 బస్తాల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. ఆటోతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఊపందుకున్న వరినాట్లు


వరినారును కట్టలు కడుతున్న వ్యవసాయ కూలీలు


జీలపాటూరులో వరినాట్లు వేస్తున్న కూలీలు

పెళ్లకూరు మండలంలో వరి నాట్లు ఊపందుకున్నాయి. ఇటీవల చెరువులు, స్వర్ణముఖి నదికి తెలుగు గంగ నీటిని విడుదల చేయడంతో రైతులు ఎడగారు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఎక్కడ చూసినా నారు మడులు సిద్ధం చేయడం, పొలం గట్లు శుభ్రం చేసే పనుల్లో కూలీలు కనిపిస్తున్నారు. మహిళలు జానపద పాటలు పాడుకుంటూ నాట్లు వేస్తున్నారు. 2,750 హెక్టార్లలో వరినాట్లు వేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఆర్ఎన్ఆర్, జీపీటీ రకంతో పాటు ఈ ఏడాది యంటీయూ 1224, యంటీయూ 1262, కేఎన్‌యం 16038 రకాల వరి వంగడాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. పునబాక, చెంబేడు, పెళ్లకూరు, రావులపాడు, చిల్లకూరు, జీలపాటూరు తదితర ప్రాంతాల్లో వ్యవసాయ బోర్ల కింద వరినాట్లు వేస్తున్నారు. –పెళ్లకూరు

ఆగిన నిర్మాణాలు




పిల్లర్లకే పరిమితమైన వేణుంబాకం సచివాలయం, వేణుంబాకంలో అసంపూర్తిగా ఉన్న ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు

దొరవారిసత్రం మండలంలో 11 గ్రామ సచివాలయాలు ఉండగా తనియాలి, పూలతోటలో మాత్రమే భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన నిర్మాణాలు అన్ని బేస్ స్థాయి నుంచి శ్లాబ్ స్థాయి వరకు వివిధ దశల్లో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. వేణుంబాకం, మీజూరు, తల్లంపాడు తదితర గ్రామాల్లో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు నిరుపయోగంగా మారి పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. వాటి గురించి అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. –దొరవారిసత్రం

వేట లేదు.. పూట గడవదు

వారంతా మత్స్యకారులు.. సముద్రంలో చేపల వేట వారి జీవనాధారం. కండలేరు క్రీక్ పై నిర్మిస్తున్న బ్రిడ్జి వల్ల వారికి ఉపాధి కరువైంది. కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి క్రీక్‌లో పిల్లర్లు వేసి వదిలేశారు. దీంతో కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలోకి పడవల రాకపోకలకు వీలు లేకుండాపోయింది. వేట లేక.. పూట గడవక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.


కండలేరు క్రీక్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జి కోసం వేసిన పిల్లర్లు

వంద కుటుంబాలు పస్తులు

- మూడు నెలలుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని కండలేరు క్రీక్‌పై బ్రిడ్జి నిర్మిస్తున్న కాంట్రాక్టు సంస్థ


మూడు నెలలుగా ఒడ్డునే ఉన్న పడవలు

చిల్లకూరు: వేట లేక..పూట గడవక మండలంలోని మోమిడి గ్రామానికి చెందిన వంద మత్స్యకార కుటుంబాలు అల్లాడుతున్నాయి. చిల్లకూరు మండలం మీదుగా కృష్ణపట్నం పోర్టుకు అనుసంధానం చేస్తూ మూడు రోడ్లు నిర్మిస్తున్నారు. ఒకటి నాయుడుపేట వైపు నుంచి కోట మీదుగా తూర్పు కనుపూరుకు, మరొకటి వరగలి రోడ్డు నుంచి తూర్పుకనుపూరు వరకు నిర్మిస్తున్నారు. ఈ రెండు రోడ్లు పంట పొలాలు, చిన్నపాటి కాలువల మీదుగా వెళ్లడంతో పెద్దగా ఇబ్బందులు లేవు. సర్వేపల్లి మండలం నారికేళ్లపల్లి నుంచి కృష్ణపట్నం పోర్టుకు నిర్మించే రోడ్డు కండలేరు క్రీక్‌పై నుంచి వెళ్తోంది. కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి కండల క్రీక్‌లో పిల్లర్లు వేశారు. దీనికారణంగా కండలేరు క్రీక్ ద్వారా సముద్రంలోకి పడవల రాకపోకలకు వీల్లేకుండా పోయింది.

సమాధానం చెప్పేనాథుడే లేరు

మోమిడి గ్రామంలోని మత్స్యకార కుటుంబాల వారికి చేపల వేట తప్ప మరోపని చేతగాదు. తీర ప్రాంతంలోని అన్ని గ్రామాలలో ఉన్న మత్స్యకారులు సముద్రం మీదకు వెళ్లేందుకు కండలేరు క్రీక్ ఒక్కటే మార్గం. అలాంటి కండలేరు మీద బ్రిడ్జి నిర్మించడంతో సముద్రంలోకి పడవలు వెళ్లలేని పరిస్థితి. కాంట్రాక్టు సంస్థతో చర్చలు జరిపినప్పటికీ కనీసం మత్స్యకారుల సమస్యపై ఒక్క సారి కూడా వారు స్పందించిన దాఖలాలు లేవు. కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతామని పలుమార్లు మత్స్యకార పెద్దలు ప్రయత్నించినప్పటికీ వారి నుంచి ఎలాంటి సమాధానం లేదు.

సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేది



కండలేరు క్రీక్‌పై బ్రిడ్జి నిర్మించే సమయంలో పడవల రాక పోకలు పూర్తిగా నిలిచి పోతాయనే విషయాన్ని మోమిడి గ్రామంలోని మత్స్యకారులకు ముందుస్తుగా సమాచారం ఇచ్చి ఉంటే బాగుండేది. అప్పుడు పడవలను గ్రామానికి దిగువన ఉన్న వరగలి రేవు వద్ద నిలుపుకుని ఉండేవాళ్లం. ఇప్పుడు క్రీక్‌పై బ్రిడ్జి నిర్మించేందుకు పిల్లర్లు వేయడంతో మూడు నెలలుగా ఒడ్డుకే పడవులు పరిమతమయ్యాయి. – అక్కయ్యగిరి మల్లికార్జున, మోమిడి, మత్స్యకారుడు

మూడు నెలలుగా వేట లేదు



చేపల వేటకు వెళ్లి మూడు నెలలవుతోంది. నిద్రలేస్తే సముద్రం మీదకు వెళ్తేనే ఇంటిల్లిపాదీ జీవనం సాగుతుంది. ఇప్పుడు పోర్టు రోడ్డు నిర్మాణంలో భాగంగా మోమిడికి దిగువన పెద్ద బ్రిడ్జి నిర్మిస్తుండదంతో సముద్రంలోకి పడవలు వెళ్లడం లేదు. దీనివల్ల గ్రామంలో ఉన్న 20 మంది పడవలు ఒడ్డున నిలిచిపోయాయి. సుమారు వంద కుటుంబాల వారికి పనులు లేకుండా పోయాయి. – కొండూరు సుధాకర్, మత్స్యకారుడు, మోమిడి, చిల్లకూరు మండలం

అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై ఫిర్యాదు

దొరవారిసత్రం : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అల్లూరు రాహుల్‌రెడ్డి కోరారు. ఆయన శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఎస్ఐ అజయ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన సతీమణి భారతమ్మపై అసభ్యకర పోస్టులు పెడుతున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకుని ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు జాలా రాజగోపాల్, నాయకులు దయాకర్‌రెడ్డి, గోను ప్రసాద్, వెంకటయ్య, మధు తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బాలసదన్‌ను పరిశీలించిన డీఎస్పీ


బాలసదన్ విద్యార్థులతో ఆటలు ఆడిస్తున్న డీఎస్పీ

కోట: మండల కేంద్రమైన కోటలో ఉన్న బాలసదన్‌ను శుక్రవారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. అక్కడున్న బాలికలతో మాట్లాడారు. వారితో కొంతసేపు సరదాగా గడిపారు. జనరల్ నాలెడ్జ్ బుక్స్ పంపిణీ చేశారు. కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాకాడు సీఐ హుస్సేన్‌బాషా, ఎస్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

24న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ర్యాలీ


మాట్లాడుతున్న మౌలానా అబూబకర్

నాయుడుపేట టౌన్: ముస్లింల హక్కులను కాలరాసేలా ప్రవేశ పెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా 24న నాయుడుపేటలో పెద్ద ఎత్తున శాంతియుతంగా ర్యాలీ చేపట్టనున్నట్టు జామియా మసీదు మౌలానా అబూబకర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఉప సంహరించుకోవాలని కోరారు. బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 24వ తేదీ ఉదయం 8.30 గంటలకు నాయుడుపేటలోని జామియా మసీదు సమీపంలో షాదీ మంజిల్ నుంచి ర్యాలీ చేస్తామన్నారు. ర్యాలీ పట్టణ ప్రధాన వీధుల గుండా పాత బస్టాండు అంబేద్కర్ విగ్రహం వరకు సాగుతుందని తెలిపారు. ముస్లింలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. హాజీ నిజామ్, సుభహాని, ఖాదర్ బాష, మస్తాన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో అగ్ని పమాదాల నివారణ


రాపూరు పెట్రోల్ బంకు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అధికారులు


కోట: ప్రమాదాల నుంచి తప్పించుకోవడంపై కార్మికులకు వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాపూరు/కోట/వెంకటగిరి రూరల్ : అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని రాపూరు అగ్నిమాపక అధికారి కుప్పయ్య, కోట ఎస్ఎఫ్‌వో హరీష్, వెంకటగిరి అధికారి ఆదినారాయణ తెలిపారు. అగ్ని ప్రమాదల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాపూరులోని పెట్రోల్ బంకు, గ్యాస్ గోడౌన్లలోని సిబ్బందికి, కోటలోని చిట్టేడు జీవీఆర్ పరిశ్రమ కార్మికులకు, వెంకటగిరి పట్టణం పాలకేంద్రం వద్ద ఉన్న పెట్రోల్ బంకు సిబ్బంది అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మాక్ డ్రిల్ చేసి చూపించారు. కోటకు చెందిన అగ్నిమాపక సిబ్బంది నాగరాజు, దేవా పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు


చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ అందజేస్తున్న చైర్ పర్సన్ దీపిక, కౌన్సిలర్ సరిత

నాయుడుపేట టౌన్: ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మున్సిపాలిటీలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. ఆమె శుక్రవారం విన్నమాల రోడ్డు వద్ద కౌన్సిలర్ రాయపు సరిత సౌజన్యంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విన్నమాల గ్రామం నుంచి వివిధ గ్రామాలకు వెళ్లే ప్రజలతో పాటు రెవెన్యూ, కోర్టు, డీఎస్పీ కార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బంది లేకుండా కౌన్సిలర్ సరిత, శేఖర్ దంపతులు చలివేంద్రం ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పోలేరమ్మ ఆలయ పెదకాపు ఆరవ భూమి శ్రీనివాసులు రెడ్డి, విన్నమాల బాబు, రాయపు శీను, గుంపెళ్ల ప్రసాద్, రత్నం, మేరిగ రమణయ్య విన్నమాల యువత పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

చిల్లకూరు: ఇంటర్‌లో ప్రతి భ చూపిన గూడూరుకు చెందిన పేద విద్యార్థినికి బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. నాయకుడు మదనబేటి రమణయ్య మాట్లాడుతూ పట్టణానికి చెందిన పసుపులేటి శృతి ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 మార్కులకు 465 మార్కులు సాధించిందన్నారు. ఇంటర్ రెండో సంవత్సరంలో విద్యా సామగ్రి తీసుకునేందుకు ఉపయోగపడుతుందనే ఆర్థిక సాయం అందించినట్టు చెప్పారు. అలాగే బాలిక ఉన్నత చదువులకు అవసరమైన ఖర్చులను భరించేందుకు నాగిసెట్టి మురళీక్రిష్ణ ముందుకు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, మహిళా సంఘం గౌరవ అధ్యక్షులు సారంగం సులక్ష్మీ, కార్యదర్శి సువర్ణలక్ష్మీ, అరుణ పాల్గొన్నారు.

తల్లులకు పాద పూజ


తల్లులకు పాద పూజ చేస్తున్న చిన్నారులు

చిల్లకూరు: పిల్లలకు చిన్నతనం నుంచే భారతీయ సంస్కృతిని అలవాటు చేయాలని గూడూరులోని స్వర్ణాంధ్ర భారతి పాఠశాల యజమాని నిరంజన్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులపై గౌరవం, చదువులపై ఆసక్తిని పెంపొందించేలా చిన్నారులతో తల్లులకు పాదపూజ చేయించారు. అనంతరం యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో పెల్లేటి నవకోటి నాయుడు, సీహెచ్ సునీల్‌రాజ్, కె.హరిక్రిష్ణ, సీహెచ్ సింధు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ


ఎమ్మెల్యే నెలవల విజయశ్రీని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఇటీవల శ్రీకాళహస్తిలో కాలుజారి గాయపడ్డారు. ఈ క్రమంలో ఆమెను శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు క్యాంపు కార్యాలయంలో పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు జెట్టి వేణుయాదవ్, అలవల సురేష్, మీజూరు రామకృష్ణారెడ్డి, చిన్ని సత్యనారాయణ, అయితా శ్రీధర్, కాకి శ్రీరామ్మూర్తి, బద్దెపూడి మోహన్‌రెడ్డి, చిలకా యుగంధర్‌యాదవ్, టీడీపీ నాయకులు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు ఆమెను పరామర్శించారు.

భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే


శిలువను ఊరేగిస్తున్న క్రైస్తవులు

చిల్లకూరు: గూడూరు పట్టణం, రూరల్, చిల్లకూరు మండలంలో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడేను ఘనంగా జరుపుకున్నారు. గూడూరులోని సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి పరిధిలోని పరిశుద్ధ పౌలు పేతురు లూథరన్ సంఘంలో సంఘ కాపరి ఎం ప్రవీణ్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సంఘ కాపరి దైవ సందేశం వినిపించారు. ఏసు క్రీస్తును శిలువ వేసిన రోజును గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటామని, ఆయన లోక రక్షకుడిగా వెచ్చి మానవుల పాపాలను తన మీద వేసుకుని శిలువ మరణం పొందారని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌సీసీ, పీసీసీ చైర్మన్ రాజయ్య, సంఘ సభ్యులు పాల్గొన్నారు. చిల్లకూరు మండలంలోని పలు చర్చిల్లో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం, ఓడూరు, నాంచారమ్మ పేట, కలవకొండ, ఏరూరు, మోమిడి అన్నంబాక, పల్లమాలలోని లూథరన్ చర్చిలలో సంఘాల కాపరులు ప్రత్యేక దేవుడి సందేశాలు వినిపించారు.

వాకాడులో..

వాకాడు: మండలంలోని వివిధ చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వాకాడు సెయింట్ జేమ్స్ లూథరన్ చర్చి ఆవరణలో క్రైస్తవులు ఏర్పాటు చేసిన శిలువ ఆకట్టుకుంది. అలాగే ఆలయంలో క్రైస్తవులు ఉప వాస ప్రార్థనలు చేసి కీర్తనల ద్వారా గుడ్ ఫ్రైడే విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎస్ ప్రశాంత్‌బాబు, యూత్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలో శుక్రవారం గుడ్ ఫ్రై డేను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేరిపేటలో ఉన్న సౌత్ ఆంధ్రా లూథరన్ చర్చి వద్ద బిషప్ ఓ మైఖేల్ బెన్‌హర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు శిలువను మోస్తూ చెప్పిన ఏడు మాటలను వినిపించారు. పరిశుద్ధ పేతురు పౌలు సంఘం సభ్యులు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక బేతేలు చర్చి పాస్టర్ శరత్ బాబు, రోమన్ క్యాథలిక్ చర్చి ఫాదర్లు ఏసుక్రీస్తు బోధనలను తెలియజేశారు. అనంతరం ప్రత్యేకప్రార్థనలు చేశారు.

డక్కిలిలో..

డక్కిలి: మండలకేంద్రమైన డక్కిలి క్యాథలిక్ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు గీతాలను ఆలపిస్తూ శిలువను ఊరేగించారు.

ఓజిలిలో..


ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలిలోని లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సంఘ కాపరి రెవరెండ్ రాజరత్నం దైవ సందేశాన్ని వినిపించారు. క్రీస్తు లోకంలో ఎన్నో అవమానాలు భరించడంతో పాటు శిలువపై మరణం పొందారని తెలిపారు. ఆయన తిరిగి పునరుత్థానం చెందాడని వివరించారు. అలాగే కురుగొండ, లూథరన్ చర్చిలోనూ ప్రార్థనలు చేశారు.

కోటలో..

కోట: మండలంలోని క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విద్యానగర్ హోలీప్రేయర్ చర్చిలో బిషప్ ప్రదీప్ కుమార్, అల్లంపాడు మెసయ్య గ్రేస్ మినిస్ట్రీ చర్చిలో పాస్టర్ ప్రభుకుమార్, ఎన్‌సీఆర్ నగర్‌లోని బెరాకా ఆరాధన మందిరంలో సంఘకాపరి నోవాబాబు దేవుడి సందేశాన్ని వినిపించారు.

డీవీ సత్రంలో..

దొరవారిసత్రం: ఏసును శిలువ వేసిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటామని ఎస్ఏఎల్‌సీ చర్చి పాస్టర్ రవికుమార్ తెలిపారు. మండలంలోని ఏకొల్లు, కుప్పారెడ్డిపాళెం, ముచ్చలగుంట, నెల్లూరుపల్లి, రామారెడ్డికండ్రిగ, కృష్ణాపురం, ఆనేపూడి, నెలబల్లి తదితర గ్రామాల్లోని ఎస్ఏఎల్‌సీ చర్చిలు, మందిరాల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడేను క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు ఏసు సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో సంఘాల సభ్యులు జయంత్ కుమార్, చంద్రయ్య, పీటర్, ప్రేమ్ పాల్గొన్నారు.








నాయుడుపేటలోని బేరిపేట చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న సంఘ పెద్దలు, కోట: అల్లంపాడు చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు, రామారెడ్డికండ్రిగ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

కండలేరులో 46.108 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 46.108 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,390, పిన్నేరు కాలువకు 5, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.